# పల్టీ

"మీరీ పని చేస్తే మరో టర్మ్ వి.సి.గా ఉంటారు. అది కాదంటే యం.పి.గానైనా ఉంటారు".

'ఎన్నికలు – అక్రమాలు – నాకిష్టం కావు కదా!'

'పార్టీ రాజ్యసభకు ఎన్నుకొంటుంది. లేదా నామినేట్ చేయిస్తుంది'.

'నాకంటే అర్హులుండగా నన్నే నామినేట్ చేయడం...'

'పార్టీకి అర్హతలతో సంబంధం లేదు. కోతిని కొండమీద కూర్చోబెడుతుంది. కాదంటే కొండను కాలిగోటికింద నిలబెడుతుంది.'

వి.సి.తో పాటు మినిస్టరు కూడా మౌనంగా కూర్చున్నాడు.

'గోంగూర మాంసం మీకిష్టమని చేయించాను. కొంచెం వేసుకోండి. వడ్డించనా?' మినిష్టరు అన్నాడు. ఇద్దరే ఎదురెదురుగా కూర్చుని భోజనం చేస్తున్నారు. పదార్థాలన్ని టేబుల్ మీద పెట్టి వంటవాళ్ళు, వడ్డించేవాళ్ళు – మినిష్టరు ఆర్డరు మేరకు – దూరంగా ఉన్నారు.

కూర రుచిగా చేశారు. కానీ రుచించటం లేదు. ఏదో అశాంతిగా ఉంది. వి.సి. ఇబ్బందిగా కూర్చున్నాడు.

'ఈ పని చేస్తే మేలే! చేయకపోతే?...' వి.సి. ప్రశ్నించాడు.

'ఉన్న వి.సి. పదవి ఊడిపోతుంది.' మినిష్టరు వెంటనే జవాబు చెప్పాడు.

'పి.యం.ను సి.యం.ను పార్టీ దించవచ్చు. మినిష్టర్‌ని, ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి తొలగించవచ్చు. ప్రతిపక్షం, పాలకపక్షాన్ని పడగొట్టవచ్చు. గవర్నర్ను వెనక్కు పిలవవచ్చు. ఐ.ఏ.ఎస్., ఐ.పి.ఎస్ ఆఫీసర్లను కూడా డిస్మిస్ చేయవచ్చు.... ' వి.సి. ముగించలేదు.

'వి.సి.ని మూడేళ్ళలో ఎవరూ తొలగించలేరంటారు. తొలగించలేరు. నిజమే! కాని వి.సి. కుర్చీ కింద మంటలేస్తుంది. లేచి వి.సి.నిలబడతాడు. పై నుంచి నిప్పులు పడతాయి. బైటకి వస్తాడు. ఎదుటి నుంచి రాళ్లవర్షం కురుస్తుంది. యూనివర్శిటి అగ్నిగుండమవుతుంది. చుట్టూ మంటలు లేస్తాయి. పత్రికలు ఆరోపణాస్త్రాలు సంధిస్తాయి.

ప్రజలు ఏదో ఉందని సందేహిస్తారు. నిజాయితీ, నీతీ నిరూపించుకోవటానికి వి.సి. తన పదవికి రాజీనామా చేస్తాడు. సరిపోయిందా? డిస్మిస్ చేసినట్లే కదా?'

'రాజీనామా చేయకపోతే..' వి.సి. ఉక్రోషంగా అడిగాడు.

'భవిష్యత్తు ఎలాగూ ఉండదు. వర్తమానం మంటల మధ్య శాశ్వత అశాంతిగా ఎదురుగా నిలుస్తుంది. ఆరోపణలు వేగంగా తీవ్రతగా పెరుగుతాయి. వాటి వాస్తవ అవాస్తవ స్థితిగతులు పరిశీలించటానికి ఎంక్వయిరీ కమిటీ పుడుతుంది. ఆరోపణలు ఋజువు అవుతాయి. జడ్జితో కమీషన్ వేస్తారు. అన్ని ఆరోపణలు వాస్తవాలని కమీషన్ రిపోర్టు ఇస్తుంది. దీనిమీద అప్పీలు చేయవచ్చు. ఈలోగా ప్రజలు ఛీ కొడతారు. అశాంతిగా పదవీకాలం ముగిసిపోతుంది. నలభై ఏళ్ల ఉద్యోగ జీవితంలో సంపాదించుకొన్న మంచిపేరుమంటగలసి పోతుంది. అశాంతితో అవమానంతో విశ్రాంత జీవితం దుఃఖంతో, పలకరించే వాళ్ళు లేక క్షణమొక యుగంగా గడుస్తుంది. భవిష్యత్తే కాదు వర్తమానం, గతం కూడా లేకుండా పోయి, ఆత్మహత్యే శరణ్యం అనుకొనే పరిస్థితి ప్రతిక్షణం ఎదుట నిలుస్తుంది' మినిష్టరు చెప్పాడు.

'అయిందా?' వి.సి. అడిగాడు.

'కాలేదు. ప్రభుత్వం చెప్పినట్లు చేస్తాను అంటే అయిపోయింది'

వి.సి. మౌనంగా కూర్చున్నాడు.

మినిష్టరు ఘుమఘుమలాడే హైద్రాబాద్ బిరియానీ వడ్డించాడు. వేట వేపుడు, కోడి కుర్మా వడ్డించాడు. 'తిను' అన్నాడు.

'కడుపు నిండింది' అన్నాడు వి.సి. 'కాదు తిను' అని చేయి పట్టి ప్లేటులో పెట్టాడు. మినిష్టరు తృప్తిగా భోంచేస్తున్నాడు.

ప్లేటులో వి.సి.చేయి కెలుకుతూ ఉంది. ఏం చేయమని మినిష్టరు కోరాడో, అదివిన్నప్పటినుంచి రక్తం ఉడికిపోతూ ఉంది వి.సి.కి.

వీళ్ళిద్దరూ ఏభై ఏళ్ళ నుంచి మిత్రులు. కాదంటే సోదరులు. ఫస్టుఫారం కలిసి చదివారు. కలిసి హరిజన హాస్టల్లో ఉన్నారు. ఆరేళ్ళు ఆత్మీయులు. వి.సి. చిన్నవాడు. మినిష్టరు పెద్దవాడు. అందువల్ల 'తమ్ముడూ' అని పిలిచేవాడు. 'అన్నా' అని పలికేవాడు.

తన చదువేదో, తనేదో తప్ప మరేం పట్టించుకొనేవాడు కాదు వి.సి. అంటరానితనమంటే కోపంగా, అంటరాని వాళ్ళుగా ముద్రవేయబడ్డ వాళ్ళంటే ప్రేమగా ఉండేది.

తన చదువు తప్ప అన్ని సంగతులూ కావాలి మినిష్టర్‌కు. 'ఇది తిండా? కుక్కలు కూడా తినవు' అని సమ్మెలు చేయించేవాడు. 'వార్డెన్ లంచగొండితనం నశించాలి. దోపిడీ అంతం కావాలి' అని నిరాహారదీక్ష చేసేవాడు. ఎప్పుడూ హాస్టల్లో, స్కూల్లో పిల్లల్ని రెచ్చగొడుతూ ఉండేవాడు. మంచి మాటకారి. అతడు మాట్లాడుతుంటే విద్యార్థులు చెవులప్పగించి వినేవాళ్ళు.

ఇద్దరూ మాలమాదిగలకు చేతనయిన సేవ చేయాలని పట్టుదలగా ఉండేవాళ్ళు.

వి.సి. యస్. యస్.యల్.సి. పాసయినప్పుడు మినిష్టరు ఫిఫ్త్ ఫారంలో ఉండిపోయాడు. వి.సి. డిగ్రీ అయిపోయినప్పుడు మినిష్టరు స్కూల్ ఫైనల్ నాలుగు అవకాశాలు పూర్తయి, మార్కుల రికార్డు నిండిపోయి చదువుమానేసి, ప్రజాసేవ ప్రారంభించాడు.

వి.సి. చాలా పెద్దపెద్ద చదువులు చదివి విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడుగా జీవితం ప్రారంభించాడు.

మినిష్టరు ప్రజాసేవ పార్టీ గుర్తించి ప్రధాన బాధ్యతలు అప్పగించింది.

ఇద్దరికీ పెళ్ళిళ్ళయి పిల్లలు కలిగి సుఖంగా బ్రతుకుతూ వచ్చారు.

నువ్వు ఎం.ఎల్.సి కావడానికి నేనూ ఓటు వేశానని వి.సి.గానీ, నువ్వు వి.సి.కావటానికి నేనూ సహాయం చేశానని మినిష్టరుకానీ చెప్పుకోలేదు.

వి.సి. పెరుగు వడ్డించుకొంటూ మినిష్టర్ను అడిగాడు. 'మీరు సూచించే సంస్కరణలు ప్రభుత్వమే చేయవచ్చు కదా!'

మినిష్టరు నవ్వాడు. 'మూతి పళ్ళు రాలాలి. మూతిమీదే కొట్టనక్కరలేదు. ముడ్డిమీద తంతే చాలు...'

'అంటే నన్ను ఆశపెట్టో, భయపెట్టో సంస్కరణలు నాచేత చేయించాలన్నమాట!'

'కరెక్టు!'

'నీకు నాదేశం ఏమిచ్చింది అని అడక్కుండా నువ్వు నీ దేశానికి ఏమిచ్చావో చూసుకో అంటుంటారు కదా రాజకీయ నాయకులు'.

'అవును!'

'మీరేం చేయనిస్తున్నారు?'

'పరిస్థితి అర్థం చేసుకోవటంలో, అంచనా వేయటంలో మీరు మీ తెలివితేటల్ని వినియోగించటం లేదు.'

'పైకి వచ్చిన దళితులు, పైకి రావలసిన దళితులకు సహాయపడాలని ప్రజలంతా ఘోషిస్తుంటారు కదా!'

'నిజమే'.

'పైకి వచ్చిన మనమే, మన వాళ్ళను పైకి రాకుండా సంస్కరణల పేరిట నాశనం చేయవచ్చా?'

'మనం ఎవరికి ఏం సహాయం చేయగలమో చేయలేమో కాని, మనమైనా మరింత పైకి వస్తాంకదా. అదీ దళితుల అభివృద్ధే కదా!'

'దళిత అధికారి చేస్తే దళితులకు మేలు చేయాలి. లేదంటే నోరుమూసుకుని ఉండాలి. కీడు చేయరాదు!'

'ఎవరి మేలు కోసం వాళ్ళు ఎవరైనా ఏమైనా చేయవచ్చు. మీరు అనుకొన్నంత మాత్రాన చేయలేరు. అనుకోనంత మాత్రాన కీడు ఆపలేరు. జరగవలసింది జరిగి తీరుతుంది'.

'ఈ సంస్కరణలనేవి దళితేతర వి.సి. చేత చేయించవచ్చునే'.

'ప్రజల్లో ఆందోళనలు బయలుదేరుతాయి. దళిత వి.సి.నే ఈ పని చేస్తే ప్రజలు తిరగబడరు!'

'దళితులు?'

'తిరగబడలేదు'.

'ద్రోహం కాదా?'

'కాదు. ఈ పని చేయటానికే మిమ్ము వి.సి.గా నియమించింది. మీరేం ప్రపంచ ప్రఖ్యాత మేధావి అనీ, విద్యావేత్త అనీ కాదు'.

వి.సి. మాట్లాడలేదు.

'దేశ జనాభాలో ఆరోవంతుకు కష్టం కలిగితే అయిదు వంతులు ఆనందిస్తారు. అంటే ఓట్లు పంట.'

'అయిదువంతుల ఆంధ్రులో భారతీయులో సంతోషించరు'

'కొందరయినా సంతోషిస్తారు. నిజానికి ఆరోవంతులో నూరోవంతు కూడా బాధపడరు.'

'ఏమయినా కానీ, దళితులు బాధితులవుతారు.'

'దళితేతరులు సంతోషితులౌతారు. అదే మాకు – రాజకీయ నాయకులకు ముఖ్యం. ఓట్లు దండుకోవటమే!'

'కాకుల్ని కొట్టి గద్దలకు వేయటం.'

'మీ యిష్టం.. ఏమయినా అనుకోండి'.

ఫ్రూట్ సాలడ్ బౌల్స్ మూతలు తీసి ఉంచాడు. ఇద్దరూ చేతులు కడుక్కొన్నారు. ఒకటి వి.సి.కి ఇచ్చి రెండోది తాను తీసుకున్నాడు.

మినిష్టరు జీవితం చాలా విలువగా ఉంది. ఖర్చుగా ఉంది. గవర్నమెంటు ఖర్చు.

పదహారు గదుల బంగళా. ఆరు పడక గదులు, పెద్ద హాలు. పెద్ద వరండాలు. ఎకరం విస్తీర్ణంలో భవనం.

నలుగురు గేటు కీపర్లు. నలుగురు గార్డెనర్లు. నలుగురు స్వీపర్లు. అందరూ దళితులే! నాలుగు కార్లు, నలుగురు డ్రైవర్లు. అందరూ సాయిబులే!

నలుగురు అటెండర్లు. నలుగురు గుమాస్తాలు. నలుగురు పి.ఏ.లు నలుగురు పి.యస్.లు వీళ్ళు బిసిలు. ఓ.సిలు

పర్సనల్ సెక్యూరిటీ స్టాఫ్. గన్‌మెన్‌లు, పదిమంది ఇరవైనాలుగ్గంటలు కాపలా సంరక్షణ.

స్కూలు ఫైనల్ తప్పిన మినిష్టరుకు ఇద్దరు ఐ.ఏ.ఎస్ ఆఫీసర్లు పి.యస్.లు గొప్ప మేధావులు.

నాలుగూళ్ళలో నలుగురు నాలుగు వర్ణాల వాళ్ళు భార్యలు, పన్నెండుమంది పిల్లలు.

'నా హోదా అర్థమయిందా మీకు?' మినిష్టరు వి.సి.ని అడిగాడు.

'మీరు మీ పార్టీలో చాలా ముఖ్యమైన వ్యక్తి అని నాకు తెలుసు. ప్రభుత్వంలో చక్రం తిప్పుతున్నారనీ తెలుసు. మీరిప్పుడూ నాకిచ్చిన వాగ్దానాలన్నీ నెరవేర్చగలరనీ తెలుసు'.

'చాలా సంతోషం. బాగా అర్థం చేసుకొన్నారు. ఎంతలేదన్నా మేధావులు కదా! పైపెచ్చు విద్యాసంపన్నులు కూడా!'

'ఈ భోగం ఎంతకాలం ఉంటుంది? అందరికీ మేలు చేసే నాయకులు ఎన్నికల్లో ఓడిపోతున్నారు. ఒక వర్గానికి హానిచేసి మీరు గెలుస్తారని నేను అనుకోను. దళితులు మిమ్మల్ని అసహ్యించుకొంటారు. ఓడిస్తారు.'

సిద్ధాంత రీత్యా మీరు చెప్పేది కరెక్టే! బాధితులు, బాధించిన వాడికి ఓటు వేయరాదు. వేయకూడదు. కానీ, దళితులు అలా కాదు. పెద్ద మనసు. అన్నీ మర్చిపోతారు. కల్లు

తాగితే సర్వం క్షమిస్తారు. నూరిస్తే ఓటేస్తారు. మనలో మనమాట – దళితులు వెన్నెముక లేని జనం. మొగతనం ఉంటే ఇన్నేళ్ళు ఇలా పడి ఉండరు.'

'మీరు తప్పుగా అంచనా వేస్తున్నారు.'

మినిష్టరు పెద్దగా నవ్వాడు. స్వీట్స్ బౌల్ మూత తీశాడు. 'తీసుకోండి' అన్నాడు. పది రకాలున్నాయి స్వీట్లు. చిన్నముక్క తీసుకున్నాడు వి.సి.

'జీవితం స్వీటుగా ఉండాలంటే, చేదు అనుభవాలు తప్పవు' అన్నాడు మినిష్టరు. నిజానికి, దానికి పూర్తి విరుద్ధంగా వి.సి. దృష్టి! ఏమీ మాట్లాడలేదు.

అన్నదమ్ముల్లా పిలుచుకొనే వాళ్ళు ఇద్దరు చిన్నతనంలో. ఆ ఆత్మీయత మాయమయింది.ఇప్పుడు తెచ్చిపెట్టుకున్న గౌరవాలతో పిలుచుకొంటున్నారు. కిళ్ళీల బాక్స్ మూత తీసి, ముందుకు నెట్టాడు మినిష్టరు. వి.సి, ఒకటి తీసుకొని నములుతున్నాడు.

వి.సి. ముఖంలోకి సూటిగా చూస్తూ మినిష్టరు అడిగాడు. 'మీరు నాకేం మాట ఇవ్వలేదు?' 'జవాబు ఆలోచించి చెబుతాను' అన్నాడు వి.సి.

'నేనేం చెప్పానో మీకు గుర్తుందా?'

'ఉంది!'

'చెప్పండి!'

'ఎవరూ అతడిపక్షాన పూనుకొని, సమ్మెలు, బంద్‌లు చేసేవాళ్లు లేకుండా ఉన్నా, ఒక యస్.సి, యస్.టి. బి.సి ప్రొఫెసర్ను – లేదా ఇద్దర్ని లేదా ముగ్గుర్ని సస్పెండు చేసి ఆ పైన డిస్మిస్ చేయాలి. వాళ్లు కోర్టుల చుట్టూ తిరుగుతున్నా ఫరవాలేదు. వాళ్ళలో క్రమశిక్షణ లేదని, విశ్వవిద్యాలయాన్ని ప్రక్షాళనం చేయటానికి ఈ చర్య అసవరమయిందని ప్రచారం చేయాలి. ఓ.సి. ప్రొఫెసర్లు ఏం చేసినా సరే, వాళ్ళ జోలికి పోకూడదు.'

'కరెక్ట్!'

'అందువల్ల ప్రొఫెసర్లలో దడపుడుతుంది. సక్రమంగా యూనివర్సిటీకి వస్తారు. క్లాసులు బాగా జరుగుతాయి. అధికారులు గొప్పపని చేస్తున్నారని జనం నమ్ముతారు. ప్రభుత్వం విశ్వవిద్యాలయ ప్రక్షాళనం సక్రమంగా చేస్తుందని ఆనందిస్తారు. ఓసిలను డిస్మిస్ చేస్తే గొడవలు పెరుగుతాయి. మిగతా వాళ్ళను శిక్షిస్తే గొడవలూ ఉండవు. ప్రభుత్వానికి మేలు. ఎన్నికల్లో ఓట్లు గ్యారంటీ.'

'రైట్. కరెక్టుగా అర్థం చేసుకొన్నారు. రెండో విషయం. విద్యార్థుల క్రమశిక్షణ. గుర్తుందా?'

'లేకేం ఉంది. రెండు, మూడు, నాలుగు ఎం.ఏ.లు, లా డిగ్రీలు, యం.ఫిల్‌లు, పి.హెచ్.డిలు చేస్తూ, దళితులు స్కాలర్‌షిప్‌ల కోసం హాస్టల్లో తింటూ యాభై ఏళ్ళ దాకా హాస్టల్లో పడి ఉండి, లేనిపోని అక్రమాలు చేస్తూ, అరాచకాలు సృష్టిస్తూ ఉంటారు కాబట్టి ఒక యం.ఏ. డిగ్రీ రాగానే యూనివర్శిటీ హాస్టలు వదిలిపోయేట్టు చర్య తీసుకోవాలి. దీనివల్ల లాభాలు ప్రభుత్వం సొమ్ము ఒక్కడే జీవితాంతం స్కాలర్‌షిప్ రూపంలో పొందుతూ మిగతా వాళ్లకు ఆటంకం కాకుండా ఉంటాడు. మరి వృద్ధులు విద్యార్థులుగా ఉంటూ హాస్టలు జీవితం కలుషితం చేస్తూ, సమాజ వ్యతిరేక శక్తులుగా రూపొందకుండా ఉంటారు'.

'స్పష్టంగా చెప్పారు. ఇంకా...?'

'యూనివర్శిటీకిగానీ, పి.జి. సెంటరుకు గాని ముప్పై మైళ్ల కంటే దగ్గరగా స్వగ్రామం ఉన్నవాళ్ళకు హాస్టళ్ళలో సీట్లు ఇవ్వకూడదు. ఇస్తే స్కాలర్‌షిప్ వస్తుంది. ఇవ్వకపోతే రాదు. రాకపోతే చదవరు. లాభాలు రెండు స్కాలర్‌షిప్పు సొమ్ము ప్రభుత్వానకి మిగులుతుంది. సీట్లు ఖాళీగా ఉంటాయి. ఇతరులకు అవకాశం వస్తుంది.'

'నిజం. బాగా చెప్పారు.'

'ఫలితం అయిదు డిగ్రీలుండే అంబేద్కరు లాంటి దళితులు రూపొందరు. హాస్టల్లో సీటు రాక, యూనివర్శిటీలో చేరక, దళితులు విద్యకు దూరం అవుతారు.'

'విశ్వవిద్యాలయ సమస్యలన్నింటికి యస్.సి. విద్యార్థులే మూలం. మూలవిచ్ఛేదం జరుగుతుంది.'

'యస్.సిలు విద్యకు దూరమవుతారు.'

'తప్పదు'.

'దళితులకు సాధ్యమయిన సహాయం చేయవలసిన దళితుణ్ని నేను సహాయం చేయకపోగా, హాని చేయాలి.'

'హాని చేయండి. చేసి పైకి రండి. దళితుడు ఎంత అభివృద్ధి చెందాడో అని మిమ్మల్ని పార్టీ చూపనివ్వండి.'

'వాళ్ళ శవాల మెట్లమీద నేను అందలం ఎక్కాలి.'

'గ్రేట్! బెస్ట్! బాగా అర్థం చేసుకొన్నారు.'

అతడి నిరుత్సాహానికి, ఇతడి ఉత్సాహానికి మధ్య రెండు నాగరికతల, రెండు సంస్కృతుల మధ్య దూరం ఉండటమే కాదు. పెరిగిపోతూ ఉంది.

'ఏమాటా చెప్పండి' మినిష్టరు రెట్టించాడు.

'నాకు ఆలోచించే సమయం కావాలి.'

'టైం లేదు!'

'నాకు న్యాయమనిపించింది చేస్తాను'

'మాకు న్యాయమనిపించింది మేం చేస్తాం'.

'చేసుకోండి!'

'ఒక్కక్షణం యూనివర్శిటీలో వి.సి.గా ఉండలేరు మీరు.'

'ఆ పరిస్థితి వస్తే, మీరుగానీ, మీ పార్టీగానీ, మీ ప్రభుత్వం గానీ, యూనివర్శిటీలో అడుగుపెట్టలేరు. పెడితే ప్రాణంతో బయటకు రాలేరు'.

'బెదిరిస్తున్నారా?'

'వాస్తవం చెబుతున్నాను'.

'మీ ప్రాణానికి ప్రమాదం'

'అది మీ పతనానికి నాంది.'

'మాదే గెలుపు మళ్ళీ! మాదే ప్రభుత్వం. మేమే పాలకులం.'

'కలలు కంటున్నారు.'

'మేం గెలుస్తాం!'

'మీరు ఓడిపోతారు.'

'నేను గెలుస్తాను.'

'నేను మిమ్మల్ని ఓడిస్తాను.'

'బయటకి పోగలరా?'

'చేతనయితే ఆపండి!' వి.సి. లేచి నిలబడ్డాడు. మినిష్టరు హడావిడిగా లేచి, వి.సి. చేతులు పట్టుకొని 'నేను పార్టీకి, ప్రభుత్వానికి ఏం చెప్పాలి?' అని అడిగాడు.

'పాలసీ మార్చుకోమని చెప్పండి.'

'నా ఆశలు, అభివృద్ధి హతమార్చారు మీరు.'

'నా అంతరాత్మను హత్య చేయబోయారు మీరు.'

ఇద్దరూ మౌనంగా నిలబడ్డారు. వి.సి. కారు దగ్గరకు నడిచాడు. వెంట మినిష్టరు వచ్చాడు. కారు డోరు తీశాడు. వి.సి. ఎక్కి కూర్చున్నాడు. బయలుదేరి కారు పోబోతున్నప్పుడు వి.సి. చెప్పాడు.

'దళితులకు మనకు సాధ్యమయితే సహాయం చేద్దాం. చేతకాకపోతే మౌనంగా పడి ఉందాం. ఏ పరిస్థితుల్లోనూ వాళ్ళకు మనం హాని చేయరాదు.'

కారు బయలుదేరింది.